సాక్షి
మెదక్
బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



కష్టాల కడలిలో..
కూతురు చదువు కోసం ఓ తల్లి బతుకు పోరాటం సాగిస్తోంది. ఆర్థిక సాయం కోసం దిక్కులుచూస్తోంది.
వివరాలు 10లో ►



ఈతకు వెళ్లి యువకుడు మృతి
ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చీకోడ్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.
వివరాలు 10లో ►



కొనుగోలు కేంద్రాలతో..
ధాన్యం కొనుగోలు కేంద్రాలతో దళారి వ్యవస్థకు చెక్ పెట్టామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు.
వివరాలు 11లో ►

షరా మామూలే!

ఇంటర్ ఫలితాల్లో జిల్లా మళ్లీ వెనుకబాటే
- ఫస్టియర్‌లో అట్టడుగు స్థానానికే పరిమితం
- సెకండియర్‌లో 29వ స్థానం
- గతేడాదితో పోల్చితే సెకండియర్‌లో కాస్తమెరుగు
- ఫలించని కలెక్టర్ వ్యూహం



మెదక్‌జోన్: ఇంటర్మీడియెట్‌లో ఫలితాల్లో ఎప్పటిలాగే జిల్లా మళ్లీ వెనుకబడింది. ఫస్టియర్‌లో యథావిధిగా రాష్ట్రస్థాయిలో 33వ స్థానానికే పరిమితం కాగా, సెకండియర్‌లో మాత్రం 29వ, స్థానంలో నిలిచి గతేడాదితో పోల్చితే కాస్త మెరుగు పడింది. ఈ ఏడు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో కలెక్టర్ చొరవ చూపినా ఫలితం లేకుండా పోయింది. కాగా వరుసగా మూడేళ్ల నుంచి ఫలితాల్లో అట్టడుగు స్థానానికే పరిమితం కావటంతో ఆందోళన కలిగిస్తుంది.

మెదక్ జిల్లావ్యాప్తంగా 59 ఇంటర్మీడియెట్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో 16 ప్రభుత్వ కాలేజీలు కాగా 8 ప్రైవేట్, 25 కాలేజీలు ఎస్సీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్స్, కేజీబీవీ తదితర కాలేజీలు ఉన్నాయి. కాగా, ఫస్టియర్, సెకండియర్‌లలో మొత్తం 11,725 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 6,456 మంది విద్యార్థులు మాత్రమే పాస్ కాగా 5,269 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇందులో ఫస్టియర్‌లో 6,153 మంది విద్యార్థులు పరీక్షరాయగా 3,028 మంది విద్యార్థులు మాత్రమే పాస్ కాగా 3,125 మంది ఫెయిల్ అయ్యారు. ఈ లెక్కన సగానికన్నా తక్కువమంది విద్యార్థులు ఫెయిల్ కావటంతో రాష్ట్రంలో అట్టడుగుస్థానం(33)వ స్థానంలో నిలిచి 49.21 శాతానికి పరిమితం అయింది. అలాగే ఇంటర్ సెకండియర్‌లో మొత్తం 5,572 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 3,428 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 2,144 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఈ లెక్కన 61.5% ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 29వ స్థానం కైవసం చేసుకుంది.


సెకండియర్‌లో కాస్త మెరుగు

గతేడాది ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఫస్టియర్‌లో యథావిధిగా 33వ స్థానంలోనే నిలవగా సెకండియర్‌లో గతేడాది 30వ స్థానంలో నిలవగా ఈ ఏడు 29వ స్థానంతో సరిపెట్టుకుంది. 2023లోనూ ఇదే రకమైన ఫలితాలు వెలువడ్డాయి. కాగా, వరుసగా మూడేళ్ల పాటు ఇంటర్ ఫలితాల్లో వెనుకబడగా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.

ఫలించని కలెక్టర్ వ్యూహం

2023, 2024లో వరుసగా రెండేళ్ల పాటు ఇంటర్ ఫలితాల్లో జిల్లా అట్టడుగు స్థానానికే పరిమితం కావటంతో ఈ ఏడు బదిలీపై వచ్చిన కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇంటర్మీడియెట్‌లో ఎలాగైనా ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశ్యంతో ఫస్టియర్, సెకండియర్‌లలో సబ్జెక్టులు బోధించే లెక్చరర్లతో ముఖ్యమైన అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రత్యేకంగా బుక్‌లెట్స్‌ను తయారు చేయించి విద్యార్థులకు పంపిణీ చేయించారు. ఆ బుక్స్‌లో పొందుపరిచిన పాఠ్యాంశాలకు ప్రాధాన్యత ఇచ్చి చదవాలని విద్యార్థులకు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల చదువును(క్లైవర్) బట్టి వారిని ఏ,బీ,సీగా విభజించి వారికి ప్రత్యేక బోధన చేయించారు. ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున రోజుకు రెండు గంటల పాటు అదనంగా ప్రత్యేక తరగతులను కొనసాగించారు. అయినప్పటికీ ఫలితాల్లో చెప్పుకోదగ్గ మార్పు లేదు.

ప్రైవేట్ కాలేజీల కారణంగానే...



ఇంటర్ ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థులు చదువులో చాలావెనుక బడ్డారు. ఆ ఫలితాలే ఓవరాల్‌గా జిల్లాపై ప్రభావం చూపాయి. ప్రభుత్వ, ప్రభుత్వ సెక్టార్ పరిధి కాలేజీల్లో గతేడాది కన్నా కాస్తమెరుగైన ఫలితాలు వచ్చాయి. కానీ, ఆశించిన మేరకు ఫలితాలు సాధించలేకపోయాం.

–మాధవి, ఇంటర్మీడియెట్ నోడల్ అధికారిణి

భూ భారతి రైతులకు వరం



పెద్దశంకరంపేటలో భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, చిత్రంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

- ప్రజల వద్దకే అధికారులు వెళ్తారు
- అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్

రేగోడ్/పెద్దశంకరంపేట(మెదక్): భూ భారతి చట్టం రైతులకు, పేద ప్రజలకు వరమని, రైతుల భూ సమస్యల పరిష్కరించడానికి ప్రజల వద్దకే అధికారులు వెళ్తారని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని రైతు వేదిక కార్యాలయంలో, పెద్దశంకరంపేటలో మంగళవారం భూ భారతి చట్టంపై ప్రజలు, రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని టీవీ ద్వారా వినిపించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా ఎలాంటి సమస్యలైనా పరిష్కరిస్తామని, భూ కబ్జాలు, అక్రమాలు, వివాదాలు తొలగించి, శాటిలైట్ ద్వారా మ్యాప్‌లు పట్టా పాస్‌బుక్‌లో పొందుపర్చుతామని అన్నారు. పౌతి అమలు వంటిని పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్‌లు చేస్తామన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూన్ 2నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. ఆధార్ లింకు ద్వారా భూధార్ కార్డులు ఇస్తామన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గతంలో పెద్దశంకరంపేట ప్రాంతంలో రాణి శంకరమ్మ భూములు పేద రైతులకు దక్కకుం డా ధరణి ద్వారా భూస్వాముల పరమయ్యాయని అన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయని, బీఆర్ఎస్ పార్టీ బినామీలకు పట్టాలు అందించిందన్నారు. అనంతరం రేగోడ్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ రమాదేవి, పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, ఆర్అండ్‌బీ ఈఈ సర్దార్ సింగ్, తహసీల్దార్ దత్తరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సీతారావమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి, ఏఓ జావిద్, ఆర్ఐలు ఫెరోజ్, విజయలక్ష్మి, సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, మధు, నారాగౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భవానీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భూభారతి అవగాహన సదస్సు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మన్నన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరుకానున్నారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నిర్లక్ష్యం తగదు

ధాన్యం తరలింపుపై అదనపు కలెక్టర్ నగేష్



వెల్దుర్తి: శెట్టిపల్లిలో కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు

వెల్దుర్తి(తూప్రాన్: రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించే విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని శెట్టిపల్లికలాన్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఓ శ్రీనివాస్‌రావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరుగుతోందని చెప్పారు. కొన్ని చోట్ల హమాలీల కొరత ఉండడంతో ఆలస్యం జరుగుతోందని, ఆయా కేంద్రాల్లో రెండు, మూడు రోజుల్లో కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు సరైన మద్దతు ధర లభిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, నాయబ్ తహసీల్దార్ రాజేశ్వరి, గిర్దావర్ నర్సింగ్ యాదవ్, ఐకేపీ ఏపీఎం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు వేగవంతం చేయాలి

కొల్చారం(నర్సాపూర్): కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యాన్ని వెనువెంటనే తూకం వేయడంతో పాటు రైస్ మిల్లులకు రవాణా చేయాలని అడిషనల్ కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం మండలంలోని వరిగుంతం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అవసరమైన గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచడం, కొనుగోలు కేంద్ర వద్ద సౌకర్యాల కల్పన తప్పనిసరని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గఫార్ మియా, ఆర్ఐ ప్రభాకర్ ఉన్నారు.

వెంటనే తూకం వేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరిధాన్యం తూకం వేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని పీర్లతండాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఓ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ధాన్యం తేమ శాతంతో పాటు నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేటప్పుడు మట్టి పెడ్డలు, పొల్లు లేకుండా చూడాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు సైతం తూకం త్వరగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీఎం సంగమేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశంగౌడ్

వక్ఫ్ చట్టంతో పేద ముస్లింలకు మేలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్

మెదక్‌జోన్: పేద ముస్లింలకు మేలు జరుగుతోందనే ఉద్దేశంతో ప్రధాని మోదీ వక్ఫ్‌బోర్డు చట్టాన్ని తెచ్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ అన్నారు. మంగళవారం వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ జన జాగరణ అభియాన్‌లో భాగంగా చట్టం గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్‌చట్టాలపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు సూచించారు. ఈ చట్టంపై కొందరు పనికట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారి నోరు మూయించాలంటే ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బూత్ కమిటీ సభ్యులపై ఉందన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాగిరాములు, కొండలరావు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, ఓబీసీ నేత కాశినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మే 20వరకు పూర్తి చేయాలి

'యువ వికాసం' దరఖాస్తులపై కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు విచారణ ప్రక్రియ మే 20వ తేదీ వరకు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా, మండల స్థాయిలో విచారణ టీంల ఏర్పాటుపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం యూనిట్లు ఏర్పాటు చేసే లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 32,640 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. తుది జాబితా ఆయా కార్పొరేషన్‌కు పంపనున్నట్లు తెలిపారు. యూనిట్లు ఏర్పాటును బట్టి ఎంపిక చేసిన లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నెలాఖరులోగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

అనంతరం హైదరాబాద్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్‌లతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీసీఈఓ ఎల్లయ్య, ఆర్డీఓ రమాదేవి, నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డిలతోపాటు ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుర్తివాడ అనాథ పిల్లలను ఆదుకుంటాం

రామ్, అరుణ్ గుప్తా ఫ్యామిలీ ఫౌండేషన్ సభ్యులు



వివరాలు తెలుసుకుంటున్న ఫౌండేషన్ సభ్యులు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం కుర్తివాడ అనాథ బాలికలను అన్ని విధాలుగా ఆదుకుంటామని రామ్, అరుణ్ గుప్తా ఫ్యామిలీ ఫౌండేషన్ సభ్యులు తెలపారు. మంగళవారం వారు బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనాథ బాలికలను కుర్తివాడలో కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముగ్గురు పిల్లలకు విద్యాభ్యాసం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కావాల్సిన ఆర్థిక వనరులు సమాకూరుస్తామని హామీ ఇచ్చారు.

భానుడి భగభగ

- జిల్లాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడగాడ్పులతో జనం ఉక్కిరి బిక్కిరి
- సూర్యప్రతాపంతో నిర్మానుష్యంగా రహదారులు



ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా

మెదక్‌జోన్: ఎండలు దంచికొడుతున్నాయి. వారం రోజులుగా మెతుకుసీమపై నిప్పుల వాన కురుస్తోంది. వడగాడ్పులతో జనం విలవిల్లాడుతున్నారు. మంగళవారం ఏకంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలోనే అత్యధిక టెంపరేచర్‌లో జిల్లా మూడో స్థానంలో ఉందని వాతా వరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన పలువురు వడదెబ్బతో మంచం పట్టిన పరిస్థితులు ఉన్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మధ్యా హ్నం వేళలో ఎండ తీవ్రతతో ప్రజలు ఇళ్లకే పరిమి తం అవుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం 6 గంటలైనా ఎండతీవ్రత తగ్గడంలేదు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల కిందసేద తీరుతున్నారు.

అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు

తప్పనిసరి అయితే తప్ప ఇళ్లనుంచి బయటకు వెళ్లొద్దని వైద్యులు చెబుతున్నారు. గొడుగు, లేదా చేతి రుమాలు నెత్తిపై కప్పుకోవాలని, తరుచూ నీరు తాగాలని సూచిస్తున్నారు. వివిధ పనులపై బయటకు వచ్చిన జనం కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, చల్లటి పానీయాలను సేవిస్తూ కాస్త ఉపశమనం పొందుతున్నారు. కాగా ఉపాధికూలీలు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు మాత్రమే పనులు చేస్తున్నారు. పనులు చేసే చోటా ఎలాంటి నీడసౌకర్యం లేక పోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

నువ్వు పెద్ద హీరోవి పో..!

- కార్యకర్త నర్సింగరావును భుజం తట్టిన కేటీఆర్
- ఆ పోలీసుల పేర్లు రాసి పెట్టాలని సూచన



నర్సింగరావుతో కేటీఆర్

రామాయంపేట(మెదక్): ''నువ్వు పెద్ద హీరోవి.. మెదక్ నియోజకవర్గంలో ఇంత వరకు ఎవరూ ధైర్యం చేయలేదు.. నువ్వు చేసింది తప్పేమి కాదు ''అని బీఆర్ఎస్ కార్యకర్త నర్సింగరావును ఉద్దేశించి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని పోలీసుల చేతిలో దెబ్బలు తిన్నట్లు ప్రచారం జరుగుతున్న నర్సింగరావును ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి మంగళవారం కేటీఆర్ వద్దకు తీసుకెళ్లారు. నర్సింగరావును పరామర్శించిన కేటీఆర్.. అధికార పార్టీకి వ్యతిరేకంగా పోస్టు పెట్టి పెద్ద హీరో అయ్యావని కితాబిచ్చారు. మెదక్ నియోజకవర్గంలో ఎవరు కూడా ఇంత ధైర్యంగా మాట్లాడలేదని, నువ్వు చేసింది తప్పు కాదన్నారు. జరిగిన ఘటనకు పార్టీ తరఫున విచారం వ్యక్తం చేస్తున్నానని, పోలీసులు ఇంతకంటే ఎక్కువ ఏం చేయలేరని కేటీఆర్ పేర్కొన్నారు. పోలీసులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం తగదని, మనకూ సమయం వస్తుందన్నారు. కానిస్టేబుల్ నుంచి మొదలు సీఐ, ఎస్ఐ వరకు పేర్లు రాసి పెట్టాలని కేటీఆర్ సూచించారు. కార్యకర్తలకు ఏదైనా ఆపదొస్తే పార్టీ నాయకులందరూ కలిసి ముందుకెళ్లాలని ఆయన సూచించారు. నర్సింగరావుకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



రుక్మిణిని సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

నర్సాపూర్ రూరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సోషల్ ఉపాధ్యాయిని రుక్మిణి పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రుక్మిణి 41 సంవత్సరాల పాటు ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైందన్నారు. రుక్మిణి సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ తారాసింగ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ఇందిరా, లచ్చానాయక్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాస్ ఎల్లం పాల్గొన్నారు. అనంతరం రుక్మిణిని ఘనంగా సన్మానించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): తండావాసుల తాగునీటి సమస్య పరిష్కరించామని మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ తెలిపారు. మండల పరిధిలోని బద్రాతండా పంచాయతీ పరిధిలోని బంజారానగర్ తండాలో కొంతకాలంగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తండావాసులు తాగునీటి కోసం నానా అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించారు. మంగళవారం సంబంధిత అధికారులు స్థానిక ఓవర్ హెడ్ ట్యాంకులోకి నీటి సరఫరా చేయడంతో తండావాసుల తాగునీటి సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ సురేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డి, ఎంపీడీఓ ఆనంద్, ఏపీఓ శ్యామ్, ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం అమలు చేయాలి

నర్సాపూర్: రాబోయే విద్యా సంవత్సరం నుంచి నూతన విద్యా విధానం అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంతో విద్యార్థులలో జీవన నైపుణ్యాలు పెంపొందుతాయని, వారికి నచ్చిన వృత్తిని ఎంచుకొని ఉద్యోగాలు పొందే అవకాశాలు ఉంటాయని చెప్పారు. సెమిస్టర్ విధానంతో విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని, పీఆర్‌సీని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట జిల్లా సంఘం నాయకులు నరేందర్‌గౌడ్, రాంచందర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ యాదయ్య

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీపీఓ యాదయ్య కోరారు. మంగళవారం నార్సింగి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఆనంద్‌కుమార్, ఈఓ నాగభూషనం ఉన్నారు.

పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లండి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లో సరైన ఆధారాలు లేని వాహనాలను సీజ్ చేశామని, సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 239 సీజ్ చేసి ఉండగా, ఇందులో ద్విచక్ర వాహనాలు 224, త్రీవీలర్స్ 09, ఫోర్ వీలర్స్–06లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 102 వాహనాలపై సీఆర్‌పీసీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డాక్యుమెంట్లు తీసుకొచ్చి వాహనాలు తీసుకొని వెళ్లాలన్నారు. పూర్తి సమాచారం కోసం జిల్లా నోడల్ అధికారి అడిషనల్ ఎస్పీ మహేందర్, 8712657901, 8712657911, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శైలేందర్ 8712657912 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. లేనిచో ఆరు నెలల తర్వాత వేలం వేస్తామన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులో చోరీ కలకలం

తులం బంగారు గొలుసు పోగొట్టుకున్న వృద్ధురాలు

జహీరాబాద్‌: జహీరాబాద్‌ నుంచి రాయికోడ్‌ మంలంలోని పీపడ్‌పల్లి గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ కలకలం రేగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మంగళవారం మధ్యాహ్నం జహీరాబాద్‌ డిపో నుంచి బయలు దేరిన బస్సు పట్టణం దాటకముందే వృద్ధురాలు తన మెడలోని బంగారం గొలుసు చోరీ అయినట్లు తోటి ప్రయాణికులకు చెప్పింది. తన పక్కనే ఉన్న మహిళనే దొంగిలించి ఉండొచ్చని అభియోగం మోపింది. సదరు మహిళ రోదిస్తూ తాను చోరీ ఎందుకు చేస్తానని వాపోయింది. అంతకు ముందే ఇద్దరు యువకులు మార్గ మధ్యలో పట్టణంలోని సిద్ధి హోటల్‌ వద్ద బస్సు దిగిపోయినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు. వారే చోరీకి పాల్పడి ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. బాధితురాలు తాను రాయికోడ్‌ మండలంలోని మహ్మదాపూర్‌ వెళ్తున్నట్లు, తన మేరు మంగళ పేర్కొంది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించినా తనకు పోలీసు స్టేషన్‌ తెలియదని, ఇంటికి వెళ్లాక కుటుంబ సభ్యులకు చెబుతానని అదే బస్సులో వెళ్లిపోయినట్లు తోటి ప్రయాణికులు పేర్కొన్నారు.

పీఏసీఎస్‌ సిబ్బందిపై పెట్రోల్‌ దాడి

నంగునూరు(సిద్దిపేట): వడ్ల కొనుగోలు విషయమై పీఏసీఎస్‌ సిబ్బందిపై పెట్రోలు పోసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసీఫ్‌ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. తిమ్మాయిపల్లికి చెందిన చల్లారం జగన్మోహన్‌ రెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చాడు. నాణ్యత పరీక్షించిన సెంటర్‌ ఇన్‌చార్జి లక్ష్మణ్‌ సన్న రకం వడ్లని బీ గ్రేడ్‌ వడ్లుగా తేల్చిచెప్పడంతో జగన్మోహన్‌రెడ్డి గొడవకు దిగాడు. ఈ క్రమంలో పాలమాకుల పీఏసీఎస్‌ సిబ్బంది అనగోని యాదగిరి మంగళవారం కేంద్రాన్ని సందర్శించి వడ్లను పరీక్షించాడు. అక్కడికి చేరుకున్న జగన్మోహన్‌రెడ్డి బూతులు తిడుతూ యాదగిరిపై పెట్రోలు పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించగా హమాలీలు అడ్డుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

వడ్ల కుప్పను ఢీకొని..

ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్‌): రోడ్డుపై పోసిన వడ్ల కుప్పలను ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని మర్పడ్గ గ్రామ శివారులో రైస్‌ మిల్లు వద్ద మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిర్సనగండ్ల గ్రామానికి చెందిన పుల్ల బాబు ద్విచక్ర వాహనంపై సిద్దిపేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బీటీ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. కిందపడటంతో తీవ్ర గాయాలై ఎడమ కాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉరేసుకొని మేస్త్రీ ఆత్మహత్య

సంగారెడ్డి: ఉరేసుకొని మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చౌటకూర్‌ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రాంతి కుమార్‌ కథనం మేరకు.. ఉన్నాపూర్‌ గ్రామానికి చెందిన వడ్డే రాఘవ (33) సోమవారం రాత్రి ఇంట్లోనే నిద్రించాడు. మంగళవారం ఉదయం రాఘవ మామ వెంకయ్య తలుపులు కొట్టి పిలువగా అతడు స్పందించలేదు. లోపల నుంచి ఎటువంటి శబ్దం రాకపోవడంతో తలుపు పగులగొట్టి చూశారు. రాఘవ ఇంటి పైపులకు ఉరేసుకొని కనిపించాడు. నాలుగు నెలల కిందట తన భార్య దుర్గమ్మ చనిపోవడంతో జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

దుబ్బాకరూరల్‌: ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన మండలంలోని శిలాజినగర్‌ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు.. దుబ్బాకకు చెందిన బట్టు నవీన్‌, బట్టు కవిత, రాధారం భాను ముగ్గురూ కలిసి ఆటోలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో జరిగే సంతలో కూరగాయలు విక్రయించడానికి వెళ్తున్నారు. శిలాజినగర్‌ శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ముగ్గురికి గాయాలు కావడంతో చుట్టు ప్రక్కల వారు గమనించి 108కు కాల్‌ చేశారు. అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కష్టాల కడలిలో...

విజయ తీరం వైపు..

కూతురు చదువు కోసం ఓ తల్లి ఆరాటం

- ఒంటరిగా బతుకు పోరాటం
- ఒడిదుడుకుల జీవితం.. తీరని దుఃఖం
- ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు
- సిద్దిపేట జిల్లా ఆకారానికి చెందిన విజయ కన్నీటి గాథ

ఏడడుగులు తోడుంటానని అగ్ని సాక్షిగా ప్రమాణం చేసిన పతిని విధి దూరం చేసింది. ఇంటి పెద్ద లేకపోవడంతో బాధ్యతలు భుజాన పడ్డాయి. పండుగొస్తే రెండు పూటలా భోజనం.. సాధారణ రోజుల్లో ఒక్క పూట తిండి గగనం.. మరోవైపు ఎదుగుతున్న ఆడపిల్లను చదివించడం ఒక పోరాటం.. ఆర్థిక పరిస్థితి బాగాలేక, అటు కన్నవారు, ఇటు కట్టుకున్న వారు ఆర్థికంగా లేక జానెడు పొట్ట కోసం బతుకు పోరాటం చేస్తున్న విజయ కష్టాల కడలిలో తీరం వైపు కదులుతుంది.. మనసున్న మహారాజులు చేయూత ఇస్తే నా కూతురు చదువుకు సాయం చేసిన వారు అవుతారని కోరారు.

– సిద్దిపేటజోన్‌

పెద్దపల్లి జిల్లాకు చెందిన విజయకు సిద్దిపేట జిల్లా ఆకారానికి చెందిన నాగరాజుతో 2011లో వివాహం జరిగింది. ఆర్థిక పరిస్థితులు అంతంతే ఉండటంతో నాగరాజు 10 ఏళ్ల క్రితం సిద్దిపేట పట్టణానికి బతుకు దెరువు కోసం వలసొచ్చాడు. స్థానికంగా ఓ ప్రైవేట్‌ ఏజెన్సీలో చిరు ఉద్యోగం సంపాదించి భార్య బిడ్డను పోషిస్తున్నాడు. సజావుగా సాగుతున్న వీరి జీవితం పై విధి పగ పట్టింది. 2020లో కరోనా వ్యాప్తి ప్రబలుతున్న సమయంలో బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లి చనిపోయాడు. అక్కడి నుంచి విజయ కష్టాలు మొదలయ్యాయి కట్టుకున్న భర్త దూరం కావడంతో సిద్దిపేటలో జీవనం కష్టతరంగా మారడంతో మెట్టినిల్లు ఆకారం గ్రామానికి తిరిగి వెళ్లింది. రెండేళ్ల తర్వాత మళ్లీ సిద్దిపేటకు బతుకు దెరువు కోసం వచ్చింది. చదువు అంతంతే ఉండటంతో విజయకు ఉపాధి అవకాశాలు లభించలేదు. పట్టణంలోని పలు చోట్ల కిరాయి ఇంట్లో ఉంటూ కూతురిని చదివిస్తూ బతుకు పోరాటం చేస్తుంది.



పిండి గిర్ని జీవనాధారంగా..

స్థానికంగా ఎన్టీఆర్‌ నగర్‌ కాలనీలో రెండు గదుల కిరాయి ఇంట్లో ఉంటున్న విజయ జీవనాధారం పిండి గిర్ని మాత్రమే.. చిన్నపాటి రేకుల షెడ్‌లో గిర్ని పెట్టుకొని బతుకు దెరువు సాగిస్తోంది. సమీపంలో ఉన్న వారు తెచ్చిన వాటిని పిండిగా మార్చి వారిచ్చే కొద్దిపాటి డబ్బులతో బతుకు బండిని నడిపిస్తుంది. నెలవారీ ఖర్చు అధికంగా ఉండడం.. పిండి గిర్ని ద్వారా వచ్చే ఆదాయం అంతంతే కావడంతో ఆర్థిక పరిస్థితి బాగాలేక నిత్యం జీవితంతో పోరాటం చేస్తోంది.

పిండి గిర్ని పడుతున్న విజయ

బిడ్డ చదువు కోసం ఆరాటం



విజయ ఒక్కగానొక్క కూతురు సాత్విక.. ప్రస్తుతం స్థానికంగా ఓ ప్రైవేట్‌ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతోంది. కట్టుకున్న భర్త దూరం అయ్యాక.. బిడ్డ భవిష్యత్‌ కోసం ఆమె పడుతున్న తపన వర్ణనాతీతం. ఎన్ని కష్టాలు వచ్చినా సాత్విక చదువుకు ఆటంకం రాకుండా ఉన్నదాంట్లో సర్దుకుపోతుంది. భర్త బతికి ఉన్నప్పుడు రెండో తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదివించింది. భర్త దూరం అయ్యాక ప్రైవేటు విద్య ఆర్థికంగా ఇబ్బంది కావడంతో రెండేళ్లు ఆకారం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. తిరిగి సిద్దిపేటకు బతుకు దెరువు కోసం వచ్చి పిండి గిర్ని నడుపుతూ బతుకును వెళ్లదీస్తుంది. మొదట్లో చదివిన స్కూల్‌లో సాత్వికను చేర్పించి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల సహకారం, చేయూతతో కూతురు చదువుకు ఆటంకం లేకుండా చదువు సాఫీగా సాగుతుంది..

మోటివేషన్‌లో కంటతడి

ఇటీవల వేలాది మంది విద్యార్థులకు తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు.. పిల్లల బాధ్యత గురించి మోటివేషన్‌ ప్రక్రియ నిర్వహించారు. వారి మోటివేషన్‌ విన్న సాత్విక తల్లీ విజయ తన కోసం పడుతున్న తపన గుర్తుకు తెచ్చుకొని కంటతడి పెట్టింది. ఇదే సభలో ఉన్న ఎమ్మెల్యే హరీశ్‌ రావు కూడా ఒక్కసారిగా కంటతడి పెట్టిన వైనం వైరల్‌గా మారిన విషయం తెలిసిందే.

బాగా చదువుకోవాలి

అమ్మ నా చదువు కోసం పడుతున్న కష్టం చూస్తే ఏడుపు వస్తుంది. అమ్మ కష్టాలు శాశ్వతంగా తీరాలి అంటే నేను బాగా చదువుకోవాలి. పెద్దయ్యాక ప్రొఫెసర్‌ అవుతా.. కానీ ఇప్పుడు చదివేందుకు మా అమ్మ వద్ద డబ్బులు లేవు అంటూ అమాయకంగా తమ ఆర్థిక పరిస్థితి గురించి చెప్పింది సాత్విక.

కూతురు కోసమే..

భర్త దూరం అయ్యాడు... పుట్టినిల్లు. మెట్టినల్లు వారు ఆర్థికంగా లేరు. ఒక్కగానొక్క కూతురు చదువు కోసం కష్టపడాలి. తప్పదు. గిర్ని మీద వచ్చేది అంతంత మాత్రమే. రెక్కాడితే కానీ ఇల్లు, పిల్ల చదువు నడిచే పరిస్థితి. సాత్విక చాలా చురుకుగా ఉంటుంది చదువులో రాణిస్తుంది. కానీ ఆర్థిక పరిస్థితి బాగాలేదు.

– బోయ విజయ

అల్లుకున్న 'నిర్లక్ష్యం'





సంగారెడ్డిలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. కరెంట్‌ స్తంభాలకు మొక్కలు తీగలా అల్లుకున్నాయి. ఇలాగే వదిలేస్తే మొక్కలు తినడానికి వచ్చిన పశువులు విద్యుత్‌ తగిలి చనిపోయే అవకాశం ఉంది. మనుషులు సైతం అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాల బారిన పడుతారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర పిచ్చి మొక్కలు తొలగించి, స్తంభాలకు ఉన్న అల్లికలు, తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సంగారెడ్డి

పాఠశాల 'శిథిలం'







మండలంలోని తిగుల్‌ నర్సాపూర్‌ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 29 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రెండు భవనాలు ఉన్నా దశాబ్దాల కిందట నిర్మించిన ఒక భవనం పూర్తిగా శిథిలమైంది. ప్రమాదం అంచున ఉపాధ్యాయురాలు విద్యార్థులకు పాఠాలు చెబుతుంది. అమ్మ ఆదర్శ కింద పాఠశాలలో నీటి సంపు, నల్లాల మరమ్మతు పనులు మాత్రమే నిర్మించారు. భవనాల కోసం మాత్రం నిధులు మంజూరు కాలేదు. పాఠశాల పరిస్థితిని జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులకు నివేదిక పంపినట్లు ఎంఈఓ మాధవరెడ్డి తెలిపారు.

– జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌):

అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- యువకుడి దారుణ హత్య
- మృతుడు ములుగు జిల్లా వాసి
- వరంగల్‌లో కిడ్నాప్‌ చేసి జిల్లెలగడ్డలో బావిలో పడేసిన వైనం
- గుర్తు తెలియని మృతదేహం కేసును ఛేదించిన పోలీసులు

హుస్నాబాద్‌రూరల్‌: జిల్లెలగడ్డ బావిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన మిస్టరీని పోలీసులు ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ములుగు జిల్లా వెంకటాపూర్‌కు చెందిన సాయి ప్రకాశ్‌ (29) చేయూత స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్నాడు. చిన్నమ్మ ఓ కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధంను గుర్తించిన సాయి ప్రకాశ్‌ కానిస్టేబుల్‌పై అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతడు సస్పెండ్‌ అయ్యాడు. ఆరు నెలల తర్వాత విధుల్లో చేరిన కానిస్టేబుల్‌ ప్రియురాలితో కలిసి అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్న సాయి ప్రకాశ్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. కానిస్టేబుల్‌ ఓ సుఫారీ గ్యాంగ్‌ను మాట్లాడి సాయిని హత్య చేసే పనిని అప్పగించాడు. 15న వెంకటాపూర్‌ నుంచి సాయి ప్రకాశ్‌ కారులో బంధువులను హన్మకొండ హాస్పిటల్‌కు తీసుకొచ్చాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో ప్రకాశ్‌ కారును రెండు ఆటోల్లో సుఫారీ గ్యాంగ్‌ వెంబడించింది. ములుగు రోడ్డులో కిడ్నాప్‌ చేసి కారులో హసనుపర్తి వద్దనే హత్య చేశారు. సాయి కారులోనే హన్మకొండ జిల్లా సరిహద్దు దాటి హుస్నాబాద్‌ మండలం జిల్లెలగడ్డలో రాత్రి ఒక వ్యవసాయ బావిలో మృతదేహం పడేసి వెళ్లిపోయారు. 17న సాయంత్రం రైతు తన బావిలో మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి హుస్నాబాద్‌ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు జిల్లెలగడ్డలోని ఇటుక బట్టీల దగ్గర సీసీ కెమెరాలో పుటేజీను పరిశీలించారు. రాత్రి కారు వచ్చి వెళ్లిన దృశ్యాల ఆధారంతో పోలీసులు కేసును ఛేదించారు. కిడ్నాపు చేసి హత్య చేసిన సుఫారీ గ్యాంగ్‌ను హన్మకొండ పోలీసులు అరెస్టు చేసినట్లు హుస్నాబాద్‌ పోలీసులు పేర్కొన్నారు.



మృతదేహాన్ని ఖననం చేస్తున్న మున్సిపాల్టీ సిబ్బంది

కూతుర్ల మృతికి కారకురాలైన తల్లిపై కేసు నమోదు

తూప్రాన్‌: కూతుర్ల మృతికి కారకురాలైన తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం మంగళవారం తెలిపారు. పట్టణ సమీపంలోని హల్దీవాగులో మాసాయిపేటకు చెందిన వడ్డేపల్లి మమత తన ఇద్దరు పిల్లలు పూజిత(7), తేజస్విని(5)ని హల్దీవాగులో తోసి తాను కూడా ఆత్మహత్యాయత్నంకు యత్నించి ప్రాణాలతో బయట పడిన విషయం తెలిసిందే. ఇద్దరు చిన్నారుల మృతికి తల్లి కారణమని ఎస్‌ఐ తెలిపారు. నిందితురాలి మరిది పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మెదక్‌ మున్సిపాలిటీ: మెదక్‌ పట్టణంలోని గుల్షన్‌ క్లబ్‌లో రెంజుకి షాటోకన్‌ స్పోర్ట్స్‌ కరాటే ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెదక్‌ జిల్లా స్థాయి కరాటే బెల్ట్‌ ఎగ్జామ్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్‌ దినాకర్‌ తెలిపారు. సుమారు 100 మంది విద్యార్థులు వివిధ మండలాల నుంచి పాల్గొని ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు రెంజుకి షాటోకన్‌ స్పోర్ట్స్‌ కరాటే ఆఫ్‌ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టర్‌ నగేశ్‌ బెల్టులు ప్రదానం చేశారు. నితన్య సిరి, ఐశ్వర్య, అక్షర, విశిష్ట రాజ్‌, సూరజ్‌, అబ్దుల్లా, అఖిల్‌, రిషి, స్వరూప్‌ సింగ్‌ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



పాఠశాల వార్షికోత్సవంలో వెంకటయ్య, వేషాధారణలో విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే మంచి క్రమ శిక్షణ అలవర్చుకుంటేనే నిజ జీవితంలో మంచి ఉన్నత స్థానాన్ని దక్కించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్‌ అధికారి భాస్కర్‌, ఎంఈఓ అంజాగౌడ్‌, మాజీ ఉప సర్పంచ్‌ వడ్ల ప్రభాకర్‌, మాజీ ఎంపీటీసీ ఉమారాణి, నాయకులు బాలాగౌడ్‌, నర్సింహులు, ఎర్త్‌ ఫౌండేషన్‌, ప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహానందిలో మల్లుపల్లి వాసి ఆత్మహత్య

విహారయాత్రకు వెళ్లి ఉరేసుకున్న యువకుడు

మిరుదొడ్డి(దుబ్బాక): మిత్రులతో కలిసి సరదాగా విహార యాత్రకని వెళ్లిన యువకుడు అక్కడ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాల చిన్న బోయ రాజు (36) కేబుల్‌ టీవీ ఆపరేటర్‌గా పని చేస్తూ భార్య సుమలతతోపాటు, ఆరేళ్లలోపు కుమారుడు, కూతురిని పోషించుకుంటున్నాడు. 17న ఉమ్మడి మండల పరిధిలోని 14 మంది కేబుల్‌ ఆపరేటర్లందరూ కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఇందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా మహానందిలో మంగళవారం సాయంత్రం దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం టెంపుల్‌కు సమీపంలో ఉన్న వాటర్‌ ట్యాంక్‌కు రాజు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని సన్నిహితుల ద్వారా తెలిసింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



రాజు మృతదేహం

పిడుగుపాటుకు గేదెలు మృతి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన రైతు కోర్పతి కృష్ణ రెండు గేదెలు మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. దీంతో రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని రైతు వాపోయాడు. వ్యవసాయానికి పాడి సంపద ఉపాధిగా ఉండేదని పిడుగుపాటుతో వాటిని కోల్పోవడం వల్ల విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

ధర్మారంలో మరో గేదె

మిరుదొడ్డి(దుబ్బాక): పిడుగు పాటుకు పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ధర్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గూళ్ల బాగులు రోజు మాదిరిగానే పాడి గేదెను వ్యవసాయ పొలం వద్ద కట్టి వేశాడు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన పిడుగు పడటంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె మృతితో సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



పిడుగుపాటుతో మృతి చెందిన గేదెలు

పిల్లలను బడిలో చేర్పించాలి

– డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్‌/ మద్దూరు(హుస్నాబాద్‌): పిల్లలను మన ఊరు బడిలోనే చేర్పించి నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులతో కలిసి పని చేయించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పొట్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మద్దూరు మండలంలోని గాగ్గిళ్లాపూర్‌ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. పిల్లల సంఖ్య తక్కువ ఉన్నప్పటికీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామస్తుల సహకారంతోనే ఇలాంటి కార్యక్రమాలు జరుగుతాయని, పిల్లల సంఖ్యను కూడ పెంచడానికి గ్రామస్తులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మనీల, హెచ్‌ఎంలు స్వరూప, వాసుదేవారెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. మద్దూరు కార్యక్రమంలో కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌శర్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌ గుంటిపల్లి కనకమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్‌, ఉపాధ్యాయులు సరళ, అనురాధ, శిరీష, వెంకటరాజు, బాల్‌ రాజు, రవితేజ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఇద్దరి ప్రాణం తీసిన ఈత సరదా

- దుబ్బాకలో యువకుడు, కొమురవెల్లిలో వ్యక్తి
- ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం

దుబ్బాకరూరల్‌: ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చీకోడ్‌ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్‌ కథనం మేరకు.. తొడ ఏగొండ, భూదవ్వ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు బాబు(25) గ్రామ శివారులో ఉన్న చెరువులోకి స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ చెరువులోకి చాలా దూరం వెళ్లి నీటిలో మునిగి పోయాడు. గమనించిన స్నేహితులు చెరువులో నుంచి బయటకు తీసుకొచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఏగొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చేతికొచ్చిన కొడుకు చెరువులో మునిగి మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

మద్యం మత్తులో వెళ్లి..

కొమురవెల్లి(సిద్దిపేట): మద్యం మత్తులో ఈత కొట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి కనకయ్య(50) కుటుబంతో కలిసి హైదరాబాద్‌లో పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పెద్ద కుమారుడుకి కొడుకు పుట్టడంతో బారసాల నిర్వహించేందుకు గ్రామానికి వచ్చారు. ఆదివారం బారసాల కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మంగళవారం కుటుంబంతో కలిసి మద్యం సేవించారు. మధ్యాహ్న సమయంలో స్నానం చేసేందుకు గ్రామ శివారులో గల పెద్ద బావి వద్దకు వెళ్లాడు. నీటికిలోకి దూకిన కనకయ్య ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో కుమారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



దుబ్బాకరూరల్‌: యువకుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు



కొమురవెల్లి(సిద్దిపేట): స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు